# వయసు వ్యాపారం

ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ అడుగులు త్వరత్వరగా పడసాగాయ్. ఇవాళ ధైర్యంగా ఇంట్లోకి అడుగు పెట్టవచ్చు.

వెళ్ళీ వెళ్ళగానే వందరూపాయల నోటు మీదకిసిరేస్తే సరి - ఉమ నోరు కట్టేసుకుపోతుంది. మరికొన్ని రోజులు ఇలా కష్టపడితే పెరుగుతున్న వయసుని దాచుకోడానికి కష్టపడే పెద్దదానికి గుడ్డలేకాదు, పిల్లలందరికీ ఏది కావాలంటే అది కొనివ్వగల్ను! వా పిల్లలూ అందరి పిల్లలలాగానే దర్జాగా తయారై, ఆనందంగా తిరగాలని నాకు మాత్రం వుండదూ?

పిల్లల విషయంలో ప్రేమంతా తనకే వున్నట్లు, నేనేమీ పట్టించుకోనట్లు మాట్లాడుతుంది ఉమ. అది దాని తప్పుకాదు. పరిస్థితుల తప్పు!

అయినా గుమాస్తాగాణ్ణి నాకు పెళ్ళెందుకు? ఏం పాముకుందామని చేసుకున్నాను? అనవసరంగా మరో ప్రాణిని కూడా నరకంలోకి లాగాను. అంతటితో వూరుకున్నామా?

ఉహూ-మరి కొంతమందిని పిల్లలరూపంలో నరకంలోకి లాక్కొచ్చాం. నా పిల్లలుగా పుట్టి వాళ్ళేం సుఖపడ్డారు? కాదు-ఏ కష్టం పళ్ళేదు?

మరో రెండు రోజులుపోతే-వాళ్ళూ, భార్యలాగానే బయటపడిపోతారు. నా అసహాయతకు సానుభూతి చూపించరు సరికదా-అసహ్యించుకుంటారు.

ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలి.

ఎలా? ఏం చేయాలి?

'ఇంకా ఎలా సంపాదించాలి?' అని బుర్ర బద్దలు కొట్టుకుంటున్న సమయంలో రవి అప్తుడులా కనిపించాడు. కనిపించడమే కాదు-అభయమిచ్చాడు. తను కోరినట్టు కథలు రాసిస్తే కనీసం రెండు వందలయినా నెలకు ముట్టచెప్తానన్నాడు. నాకు కావలసింది డబ్బు. అతనికి కావలసింది పచ్చి శృంగార కథలు!

ఈ మధ్య నాలో వున్న రచయిత నాకెట్లాగూ వుపయోగపడడంలేదు. వాడ్ని ఈ విధంగా వుపయోగించుకుంటే మాత్రం తప్పేమిటి?

వెంటనే వప్పేసుకున్నాను.

అక్కడికక్కడే కూర్చుని పచ్చి పదజాలాన్నంతా ఏర్చి కూర్చి అయిదు కథల రూపంలోకి మార్చి అతనికిచ్చేసి వచ్చాను.

"ఆ పుస్తకం మార్కెట్‌లో వచ్చీ రాక ముందే అమ్ముడైపోయింది. ఇప్పుడు మనక్కావాలన్నాఒక్క కాపీ దొరకదు. ఇవాళ రాత్రికి నువ్వు మా ఇంటికి వచ్చి కూర్చుని మరో సెట్ రాసివ్వు. వెంటనే పబ్లిష్ చేసేద్దాం. వేడిలో వేడి - ఇటువంటప్పుడే మన సామర్థ్యాన్నంతటినీ సొమ్ము చేసేసుకోవాలి. ఈ సారి క్రిందటిసారిలా పుస్తకం విడుదలయ్యేంతవరకూ కాకుండా, నువ్వు కథలు రాసివ్వగానే డబ్బులిచ్చేస్తాను అన్నాడు. పొద్దున రవి ఆఫీసుకొచ్చి మొదట రాసిన కథల తాలూకు వందరూపాయలనిస్తూ.

అతని మాటలు విన్నప్పుడు కూడా బయటపడని ఉత్సాహం వంద కాగితాన్ని చూడగానే పెల్లుబికి రాసాగింది. వెంటనే ఆఫీసుకి శలవు పెట్టి రవిక్కావలసిన కథలని అర్జంటుగా రాసిచ్చేద్దామనుకున్నాను. కానీ, డబ్బుమనిషిగా అతని ముందు



అంతలా బయటపడడం ఇష్టంలేక, బలవంతాన ఆ కోరిక నణచుకున్నాను.

"రాత్రి భోజనాలయింతర్వాత మీ ఇంటికి వస్తాను. అప్పుడు కూర్చుందాం" అన్నాను.

అనుకోకుండా ఆఫీస్‌లో అర్జంట్ పని తగలడంతో ఆలస్యమైపోయింది. ఇంటికి వెళ్ళి వెళ్ళకముందే గబగబా భోంచేసి రవి వాళ్ళింటికి వెళ్ళాలి. ఇప్పటికే నేను రాలేదని అతను కంగారు పడుతుంటాడు. వీలైతే ఇవాళ రెండు పుస్తకాలకు సరిపడా కథలు రాసివ్వాలి.

మంచి కథలు రాయాలంటే ఆలోచించాలి కాని, ఇటువంటి కథలు రాయాలంటే ఎందుకు? ఓపికుండాలేగాని ఎన్ని కథలయినా వరుసబెట్టి రాసిచ్చేయచ్చు!

మనసానందంతో నిండిపోయింది. రకరకాల ఆలోచనల్తో ఇల్లు చేరుకున్నాను. నేననుకున్నట్లు ఉమ వరండాలో ఎదురవ్వలేదు. వంటింట్లోంచి అరుపులు వినబడుతున్నాయ్!

నేను వచ్చినట్లు చంటాడు లోపలికిపోయి చెప్పినట్లున్నాడు - చేతిలో గరిటతో సర్రున దూసుకొచ్చింది. "వాళ్ళవర్నీ కాదు అసలు మిమ్మల్ననాలి"అంటూ.

ఇంట్లోకి అడుగుపెట్టీ పెట్టగానే ఉమ ఎదురొస్తుంది. చటుక్కున దానికి వందరూపాయల కాగితాన్నందిస్తాడు తను. ఆ కాగితాన్ని చూడగానే ఆమె మొహం ఆనందంతో వెలిగిపోతుంది....' ఇలా ఎన్నో రకాలుగా వూహించుకుంటూ వచ్చిన నాకు ఉమ అపరకాళిలా దర్శనమిచ్చేసరికి వళ్ళు మండిపోయింది. కోపాన్ని నిగ్రహించుకో లేక పోయాను.

"ఏమిటీ? ఏమైందీ? ఇంట్లోకి వచ్చీ రాకముందే ఏమిటా గావుకేకలు?" నాకు తెలీకుండానే నా కంఠంలో కోపం ప్రతిధ్వనించింది.

"ఏమైందా? దానికి పాతికేళ్ళు వస్తున్నాయి సంబంధాలు చూడండీ అంటూ నెత్తీ నోరు బాదుకున్నా వినిపించుకోరు."

గుండెలు గుభేలుమన్నాయ్! 'కొంపదీసి..... అమ్మో!? మనసు మొద్దుబారిపోతోంది.

"అబ్బబ్బ! నీ సాధింపులు కాసేపు కట్టిపెట్టి అసలేమి జరిగిందో చెప్పు?" అడిగాను కంగారుగా.

"ఇంకా ఏం కావాలి? అయినా, అయిన తర్వాత ఏం చేయగలం గనుక? చంటిది గుక్కపట్టి ఏడుస్తున్నా పట్టించుకోకుండా గదిలో ఏం చేస్తోందో అని వచ్చేసరికి ఇదిగో, ఈ ప్రేమలేఖ చదువుకుంటోంది.. ఎవడో దీని క్లాసేనట! దీన్ని రేపు సాయంత్రం సినిమా హాల్లో కలుసుకోమంటూ రాశాడు. నన్ను చూడగానే వుత్తరాన్ని ఠకీమని దిండు కిందకు తోసేసింది. నేను తలగడ తీసి చూసేసరికి ఈ ఉత్తరమే కాదు - దీన్నిలాంటి పాడు పన్లకు పురిగొల్పే ఈ బూతుల పుస్తకం కూడా వుంది. డబ్బు కోసం గడ్డి తినే నీచమయిన వెధవలు ఇలాంటి పుస్తకాలు రాస్తే, ఆ చెత్త చదివి ఇదిలా తయారైంది."

నివ్వెరపోతూ ఆ పుస్తకం, అందులో వున్న ప్రేమలేఖ తీసుకొని చూశాను. కళ్ళు గిర్రున తిరిగాయ్. ఆ బూతు పుస్తకం రాసింది కాదు - నేను రాసిందే!

డబ్బుకోసం గడ్డితిని నేనా పుస్తకం రాస్తే, ఆ డబ్బుకోసమే గడ్డితిని రవి దాన్నచ్చువేశాడు. అన్నెం పున్నెం తెలీని అమాయకులు ఆ మాయలో పడి కొట్టుకుపోతున్నారు. ఇప్పుడా పుస్తకం తాలూకు చెడు ప్రభావం నా కుటుంబం మీదే పడుంది.

నేను బూతు కథలు రాయడంలో లేని తప్పు. అది చదవగా ఏమొచ్చింది?

ఆ లేత మనసులో విపరీతమైన ఆలోచనలకు బీజం వేసింది ఎవరు?

కన్నతండ్రే!

ఈ విషయం తెలిస్తే ఉమ నన్ను క్షమిస్తుందా? అలాంటి పుస్తకాలు రాసి సంపాదించిన డబ్బే తనకివ్వబోతున్నానని తెలిసి ఎంత చీదరించుకుంటుంది? ఆ క్షణంలో నా జేబులోని వంద రూపాయల కాగితం విషసర్పంలా కదులుతున్నట్లనిపించింది. యవ్వన బలహీనతలకి లోబడకుండ పిల్లలను హెచ్చరించాల్సిందిపోయి, వారి వయసు బలహీనతల్తో వ్యాపారం చేస్తున్నాను.

లక్ష్మి వణికిపోతూ నా ముందు నిల్చుంది. నేనేమంటానో, ఎలా శిక్షిస్తానో అని ప్రాణాలు కళ్ళలో పెట్టుకొని చూస్తోంది. తండ్రినయినా ఆమెను శిక్షించే హక్కు నైతికంగా నాకెక్కడుంది? దోషిలా తలవంచుకుని బయటికొచ్చేశాను ఆ గదిలోంచి.

బయట రవి నిలబడున్నాడు.

నేను రావడం ఆలస్యమయిందని నన్ను పిలవడానికి తనే వచ్చినట్లున్నాడు.

"వెళ్దామా మా ఇంటికి?"నన్ను చూసి నవ్వుతూ అడిగాడు.

అతని నవ్వు నన్ను అపహాస్యం చేస్తున్నట్లనిపించింది. "సారీరా! ఇదిగో పొద్దున నువ్విచ్చిన వందరూపాయలు. ఇక నుంచీ అలాంటి కథలు రాయదల్చుకోలేదు. నీకు నమస్కారం చేస్తాను డబ్బుకోసం ప్రచురించి అమాయకులయిన యువతీ యువకులను తప్పుదారి పట్టించకు."

రవి మాట్లాడలేదు. నవ్వి వెళ్ళిపోయాడు.

అవును! నేను కాకపోతే డబ్బు కోసం గడ్డితినే మరో రచయిత దొరకకపోడు అతనికి!

*

(విజయ మాసపత్రిక - ఫిబ్రవరి 1979)